లక్ష మంది యువతను భాగస్వాములను చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో లక్ష మంది యువతను లీడ్ ఇండియాలో భాగస్వాములను చేయాలని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్.బి.సుదర్శన ఆచార్య అన్నారు. కనపాక యూత్ హాస్టల్లో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న లీడ్ ఇండియా శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మన దేశాన్ని విశ్వ గురువుగా తీర్చిదిద్దడమే లీడ్ ఇండియా ముఖ్య ఉద్దేశమని, అందుకోసం యువత ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సమన్వయకర్త జ్ఞానేశ్ గురూజీ, హేమసుందర్, డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, బి.సూర్యలక్ష్మి, లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు బాబ్జి, విశ్రాంత ఎంపిడిఒ శ్రీనివాసరావు, కుమారస్వామి పాల్గొన్నారు.

ప్రయివేటు విధానంతో మైన్స్ సంక్షోభం

రాష్ట్ర ప్రభుత్వం రాయల్టీ వసూళ్లను ప్రయివేటుకు అప్పగించడంతో మైనింగ్ పరిశ్రమ సంక్షోభంలోకి వెళ్లిపోయింది. జిల్లాలో 90 శాతం స్టోన్‌క్రషర్లు మూతపడగా, క్వారీల్లో పనులు నిలిచిపోయి, వేలాది మంది ఉపాధి కోల్పోయిన పరిస్థితి నెలకొంది. మరోవైపు నిర్మాణరంగం కుప్పకూలి కార్మికులు రోడ్డున పడ్డారు. తీవ్ర సంక్షోభం నెలకొన్నా పాలక వర్గాలు, ప్రతిపక్షాలు మాట్లాడని పరిస్థితి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకుంటే వేలాది కుటుంబాలు పనుల కోసం వలస పోయే ప్రమాదం ఉందని కార్మిక వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.



మూతపడిన స్టోన్‌క్రషర్

- 90 శాతం స్టోన్ క్రషర్లు మూత
- సామాన్యులపై పెను భారం
- కుదేలైన నిర్మాణ రంగం, ఉపాధి

ప్రజాశక్తి - జామి

జిల్లాలో 250కుపైగా రోడ్డు మెటల్ క్వారీలున్నాయి. వీటిపై సుమారు 200 స్టోన్ క్రషర్లు ఆధారపడి పనిచేస్తున్నాయి. మొత్తం క్వారీలు, క్రషర్లలో 5 వేలకు పైగా కార్మికులు పనిచేస్తున్నారు. గత నెల ఒకటో తేదీ నుంచి ప్రభుత్వం రాయల్టీని ప్రయివేటుకు అప్పగించింది. రాఘవ ప్రయివేటు సంస్థకు జిల్లాలో సుమారు రూ.9 కోట్లకు కట్టబెట్టారు. దీంతో ప్రతి క్వారీ, క్రషర్ వద్ద చెక్ పోస్టులు పెట్టి, రాయల్టీ చెక్ చేస్తున్న పరిస్థితి నెలకొంది. మరోవైపు అత్యధిక క్వారీలకు లీజు గడువున్నా, రెన్యువల్ కాకపోవడంతో రాయల్టీ బిల్లులు చూపించే పరిస్థితి లేదు. దీంతో అనివార్యంగా క్వారీలు, క్రషర్లు మూతబడ్డాయి.

రోడ్డున పడ్డ కార్మికులు

క్వారీలు నిలిచిపోవడంతో క్వారీ కార్మికులు పనులకు దూరమై, రోడ్డున పడ్డారు. క్వారీ యజమానులు మైన్స్ అధికారుల చుట్టూ ఫైల్స్ పట్టుకుని తిరుగుతున్నా, ప్రభుత్వ నిబంధనల పుణ్యమా? అని క్వారీలు రెన్యువల్ పొందే అవకాశం లేదు. ఈ నేపథ్యంలోనే అనివార్యంగా క్వారీలు మూతబడుతున్నట్లు తెలుస్తోంది. అనుమతులున్న క్వారీల్లో కూడా పనులు గణనీయంగా తగ్గిపోయాయి. ప్రతి స్టోన్ క్రషర్ లో 20 నుంచి 30 మంది వరకు కార్మికులు పనిచేసేవారు. జిల్లాలో 90 శాతం మూతబడి, మొత్తం కార్మికుల ఉపాధి గల్లంతైంది.

సామాన్యులపై భారం

క్వారీలో మెటీరియల్ తరలించడంలో భాగంగా రాయల్టీ వసూలు బాధ్యత ప్రభుత్వం నిర్వహించేది. కానీ ప్రభుత్వం ఈ బాధ్యతను ప్రయివేటుకు అప్పగించడంతో యూనిట్‌కి రూ.800 రాయల్టీ బిల్లు కట్టాలి. ఈ బిల్లులు అనుమతులు ఉన్న క్వారీలకు ప్రభుత్వం మంజూరు చేయాల్సి ఉంది. కానీ ఇసి (పర్యావరణ అనుమతులు) లేక అత్యధిక క్వారీలు అనుమతులు లేవు. దీంతో రాయల్టీ బిల్లులు చూపించే పరిస్థితి లేదు. ఉన్న కొద్దిపాటి క్వారీల్లో రాయల్టీ బిల్లులు ఉన్నా, గతం కన్నా.. ధరలు అమాంతంగా పెంచేసిన పరిస్థితి. ఈ నేపథ్యంలోనే యూనిట్ 20 ఎంఎం పిక్క ధర గతంలో రూ.3300 ఉంటే ప్రస్తుతం రూ.5 వేలపైనే పలుకుతోంది. మైనింగ్ మెటీరియల్ ధరలు రెట్టింపు కావడంతో సామాన్యుల ఇళ్ల నిర్మాణం తీవ్ర భారమైంది. దీంతో నిర్మాణ పనులు ఆగిపోయాయి. ఫలితంగా నిర్మాణ రంగంలో కార్మికులు పనులకు దూరమై, నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ నిర్ణయం వెనక్కి తీసుకోకుంటే, రానున్న రోజుల్లో మైనింగ్ రంగం దెబ్బతిని పోవడం ఖాయమని పలువురు హెచ్చరిస్తున్నారు.

25న జిల్లాకు సిఎం జగన్

గిరిజన విశ్వవిద్యాలయానికి శంకుస్థాపన ఏర్పాట్లపై సమీక్షించిన రాజన్నదొర, బొత్స

ప్రజాశక్తి-విజయనగరం

ఈ నెల 25న కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి శంకుస్థాపన చేస్తారని విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర విద్యాశాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా పాల్గొంటారని తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై విద్యాశాఖా మంత్రి, ఉప ముఖ్యమంత్రి మంత్రి రాజన్నదొర, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి దీపికతో కలిసి అన్ని శాఖల అధికారులతో ఆదివారం కలెక్టరేట్ ఆడిటోరియంలో సమావేశం ఏర్పాటు చేశారు. సిఎం పర్యటన ఏర్పాట్లపై మంత్రి బొత్స తగు సూచనలు చేశారు. తక్కువ సమయం ఉన్నందున అధికారులంతా సమన్వయంతో పని చేయాలన్నారు. వర్షం పడే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయాలని సూచించారు.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యక్రమానికి మరడాం వద్ద హెలిపాడ్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ల్యాండ్ లెవెలింగ్, డెకరేషన్, సీటింగ్ ఏర్పాట్లు, తాగునీరు, పారిశుధ్యం ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాస రావు, ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, శంబంగి వెంకట చినప్పల నాయుడు, జెసి మయూర్ అశోక్, డిఆర్‌ఒ గణపతిరావు, ట్రైబల్ యూనివర్సిటీ డీన్ మిశ్రా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సభాస్థలిని పరిశీలిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర, జెడ్‌పి చైర్మన్ మజ్జి

సభాస్థలి పరిశీలన

దత్తిరాజేరు : కేంద్రీయ గిరిజన యూనివర్సిటీ శంకుస్థాపనకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని, ఎలాంటి లోపాలూ లేకుండా జాగ్రత్తలు తీసుకొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అధికారులను ఆదేశించారు. సిఎం శంకుస్థాపన చేయనున్న కుంటినవలసలోని ప్రాంతాన్ని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, బొబ్బిలి, గజపతినగరం ఎమ్మెల్యేలు చినప్పలనాయుడు, అప్పలనరసయ్య, గిరిజన యూనివర్సిటీ విసి కట్టమణి, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్‌పి దీపికతో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. అధికారులకు, సిబ్బందికి ఏర్పాట్లపై తగిన సూచనలు చేశారు. శంకుస్థాపన ప్రాంతానికి వెళ్ళే రహదారి విస్తరణ చేయాలని, వాహనాల పార్కింగ్ స్థలం చదును చేయాలని సూచించారు.

కార్యక్రమంలో ఆర్‌డిఒ శేషశైలజ, డిఎస్‌పి శ్రీధర్, సిఐలు అప్పలనాయుడు, విజయనాథ్, ఆర్అండ్‌బి డిఇ శ్రీనివాసరావు, ఎంపిపి గేదెల సింహాద్రి అప్పలనాయుడు, వైస్ ఎంపిపిలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, దత్తిరాజేరు, మెంటాడ తహశీల్దార్లు బి.గురుమూర్తి, రామకృష్ణ పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న శ్రామిక మహిళా రాష్ట్ర నాయకులు మణి

శ్రామిక మహిళల సమస్యలపై పోరాటం

శ్రామిక మహిళా రాష్ట్ర నాయకులు మణి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శ్రామిక మహిళల సమస్యలు ఈ ప్రభుత్వాలకు పట్టడం లేదని, వాటి పరిష్కారం కోసం పోరాటానికి సిద్ధం కావాలని శ్రామిక మహిళా రాష్ట్ర నాయకురాలు పి.మణి పిలుపునిచ్చారు. ఆదివారం కె.ఎల్.పురంలోని శ్రామిక భవనంలో శ్రామిక మహిళా జిల్లా నాయకులు వి.లక్ష్మి అధ్యక్షతన అన్ని సంఘాల శ్రామిక మహిళలతో జిల్లా సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం మహిళలను హింసకు గురిచేసే విధానాలను అవలంబిస్తోందన్నారు. నేటికీ మహిళలు పనిచేస్తున్న చోట రక్షణ లేదన్నారు. లైంగిక వేధింపులు నిరోధక కమిటీలను ఎక్కడా ఏర్పాటు చేయడం లేదని చెప్పారు. మద్యం, గంజాయి విచ్చలవిడిగా అందుబాటులో ఉండడం వల్ల ఆ ప్రభావం మహిళలపై పడుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. దీంతో ఆర్థిక, సామాజికంగా ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. కేంద్ర ప్రభుత్వం యుసిసిని అమలు చేయడానికి ప్రయత్నిస్తోంది తప్ప పార్లమెంటులో 33 శాతం మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు చేయడానికి ఏమాత్రమూ చిత్తశుద్ధి చూపడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. మహిళా ఉద్యోగులు వివిధ స్థాయిల్లో వివక్షతకు గురవుతున్నారని ఆవేదన చెందారు. ఎన్నికలప్పుడే మహిళా ఉద్ధరణ, మహిళా సంక్షేమం.. అంటూ పాలకులు నినాదాలు ఇస్తున్నారు తప్ప ఆచరణలో మహిళా హక్కులను హరిస్తున్నారని మండిపడ్డారు. మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు, మెటర్నటీ లీవ్‌లు, సమాన పనికి సమాన వేతనాన్ని ప్రభుత్వాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సదస్సులో నాయకులు బి.సుధారాణి, ఎస్.అనసూయ, డి.రామలక్ష్మి, కృష్ణవేణి, బి.పైడిరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ పాల్గొన్నారు.

జిఒ 117తో ప్రభుత్వ విద్య పతనం

- వాస్తవాలకు దూరంగా సర్కారు ఆలోచన
- సుడిగుండంలో విద్యార్థులు
- మండిపడుతున్న ఉపాధ్యాయ సంఘాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిఒ 117 ప్రభుత్వ విద్యను నాశనం చేస్తుందా? ప్రయివేటు విద్యను ప్రోత్సహిస్తుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన సర్కారు.. నూతన విద్యా విధానంలో భాగంగా 117 జిఒను తీసుకొచ్చి ప్రభుత్వ విద్యను పేదలకు అందకుండా చేస్తోందా? అంటే ఉపాధ్యాయ, మేధావి వర్గం నుంచి అవుననే సమాధానం వస్తోంది. ఉపాధ్యాయ సంఘాలు ఇప్పటికే 117 జిఒకు వ్యతిరేకంగా ఆందోళనబాట పట్టాయి.

సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకంగా ప్రభుత్వాలు నిర్ణయాలు అమలు చేస్తున్నాయి. మొన్నటి వరకు ప్రాథమికోన్నత పాఠశాలలో సర్దుబాటు పేరుతో స్కూల్ అసిస్టెంట్లను హైస్కూళ్లకు పంపించారు. దీంతో స్కూల్ అసిస్టెంట్లు లేకపోవడంతోపాటు 60 మంది విద్యార్థులు ఉన్నా ఒక్క ఉపాధ్యాయుడే ఉండటంతో పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య గతేడాది కంటే తగ్గింది. సుమారు 20 వేల మంది వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చేరిన వారి సంఖ్య తగ్గిపోయింది. ఫలితంగా ప్రయివేటు స్కూళ్లలో చేరిన వారి సంఖ్య పెరిగింది. దీంతో 60 మందిలోపు, కిలోమీటర్ దూరం ఉన్న పాఠశాలలను మూసేయడం, విలీనం చేయడం వంటి చర్యలు చేపట్టారు. ఫలితంగా చాలా వరకు స్కూళ్లు మూతపడ్డాయి. ఉపాధ్యాయ పోస్టులు లేకుండా పోయాయి. దీంతో ప్రాథమిక విద్యను సర్వ నాశనం చేసేందుకు తోడ్పడిన జిఒ మరలా ఇప్పుడు హైస్కూల్ విద్యను నాశనం చేసేలా తయారైంది. మళ్లీ సర్దుబాటు ప్రక్రియ చేపట్టారు. కొద్దిరోజులుగా సర్‌ప్లస్ పేరుతో ఉన్న స్కూల్ అసిస్టెంట్లను మళ్లీ ప్రాథమికోన్నత పాఠశాలలకు సర్దుబాటు చేసే ప్రక్రియ చేపట్టారు. ఇది విద్యార్థుల సంఖ్య ఆధారంగా కాకుండా సెక్షన్ల ఆధారంగా చేయడంతో హైస్కూళ్లలో ఉపాధ్యాయుల సంఖ్య తగ్గిపోనుంది. దీంతో నాడు ప్రాథమిక పాఠశాలలను నాశనం చేసిన విధానం నేడు హైస్కూళ్లకు అమలు చేస్తుండటం వల్ల అంతిమంగా విద్యార్థులు నష్టపోతున్నారు.

ప్రాథమిక విద్య స్థానిక భాషలో జరగాలి. అదే విధంగా ప్రాథమిక విద్య డైట్ ఉపాధ్యాయులు ద్వారా బోధించాలని సుప్రీంకోర్టు తీర్పు కూడా ఇచ్చింది. అలా కాకుండా బలవంతంగా ప్రాథమిక విద్యలోనే ఆంగ్ల మాధ్యమం అమలు, ప్రాథమిక విద్యా బోధన స్కూల్ అసిస్టెంట్లతో చేయించడం రాజ్యాంగ విరుద్ధం. పేద, సామాన్య విద్యార్థులకు రాజ్యాంగం కల్పించిన ఉచిత విద్యను రాష్ట్ర ప్రభుత్వం చాపకింద నీరులా అందకుండా ప్రయత్నం చేస్తుంది. మరో వైపు భవిష్యత్తులో ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి కూడా అవకాశం లేకుండా ప్రభుత్వం నిర్ణయం, జిఒ 117 తోడ్పడతాయి. దీంతో ఉపాధ్యాయ సంఘాల దీనిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ విధానాన్ని అడ్డుకోకుంటే భవిష్యత్తు తరాలకు ప్రభుత్వ విద్య అందని ద్రాక్షగా తయారు కావడం ఖాయంగా కనిపిస్తోంది.

జిఒ 117తో ప్రభుత్వ విద్య విచ్ఛిన్నం

జిఒ 117 ప్రభుత్వ విద్యను విచ్ఛిన్నం చేయడానికి తప్ప మరొకటి కాదు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా, సుప్రీం కోర్టు తీర్పులకు వ్యతిరేకంగా ప్రభుత్వం విద్యా విధానాన్ని అమలు చేస్తోంది. దీని వల్ల ప్రభుత్వ విద్య పతనం ఖాయం. ఈ విధానాన్ని వెంటనే ప్రభుత్వం మానుకోవాలి.

\- డి.రాము, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు

హైస్కూల్ విద్య సర్వ నాశనం

జిఒ 117 ద్వారా ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ ప్రాథమిక విద్యను, హై స్కూల్ విద్యను సర్వ నాశనం చేయడానికి తప్ప మరొకటి కాదు. సెక్షన్ల ఆధారంగా ఉపాధ్యాయ పోస్టులు కుదించేస్తే నాణ్యమైన విద్య ఎలా సాధ్యం?. వెంటనే జిఒ 117ను రద్దు చేయాలి.

\- సన్యాసిరాజు, ప్రధానోపాధ్యాయుల సంఘం సంఘం జిల్లా కార్యదర్శి

తైక్వాండో జిల్లా జట్టు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈ నెల 26, 27వ తేదీలలో కాకినాడలో జరిగే 9వ రాష్ట్రస్థాయి సీనియర్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌కు ఉమ్మడి విజయనగరం జిల్లా జట్టును ఆదివారం స్థానిక విజ్జీ స్టేడియంలో ఎంపిక చేశారు. సీనియర్ ఉమెన్, మెన్ విభాగాల్లో ఎంపిక ప్రక్రియ చేపట్టారు. శేఖర్, బి.స్వాతి, జి.రాధ, పి.మణికంఠ, ఎన్.నవ్య, కె.ఉదయ్‌కుమార్, సిహెచ్.సాయికుమార్, కె.రామకృష్ణ, కె.శ్రీనివాసరావు, కె.అరుణ్ కుమార్, ఎస్.రాహుల్, ఎం.జి. సాగర్ దొర ఎంపికైనట్లు జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు చారి ప్రసాద్ తెలిపారు.

సేవతోనే గుర్తింపు

ప్రజాశక్తి-విజయనగరం కోట

మనం చేసే సేవే గుర్తింపు తీసుకువస్తుందని ఆలిండియా హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కొత్తలి గౌరినాయుడు తెలిపారు. ఎఐహెచ్‌ఆర్‌ఎ జిల్లా అధ్యక్షులుగా గౌరినాయుడును కొనసాగిస్తూ అసోసియేషన్ వ్యవస్థాపకులు నియామక పత్రాన్ని అందజేయడంతో పలువురు నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆయనను ఆదివారం అభినందించారు. మరింత బాధ్యతతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతానని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిల్మ్ డైరెక్టర్ ఎ.వెంకటేష్ నాయుడు, సుబ్లుణ్, దళిత సంఘం నాయకులు రాజు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కాదు.. చంద్ర బాబా

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

టిడిపి అధినేత చంద్రబాబు.. కొత్తగా చంద్ర బాబా అవతారమెత్తి తాయత్తులు ఇస్తారేంటని, ఆయన తాయత్తులకు అంత బలమే ఉంటే గత ఎన్నికల్లోనే గెలిచి ముఖ్యమంత్రి అయ్యేవారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి వ్యాఖ్యానించారు. వైసిపికి ప్రజాదరణ మరింతగా పెరిగిందని, పంచాయతీ ఉప ఎన్నికల ద్వారా ఈ విషయం రుజువైందని వెల్లడించారు. ఆదివారం విజయనగరంలోని తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఏ ఇబ్బంది కలిగినా, ఎటువంటి అవసరం వచ్చినా వైసిపి నాయకులు అండగా ఉన్నారన్న ధైర్యం కల్పించామన్నారు. రానున్న కాలంలో టిడిపికి ఓటు అడిగే హక్కు లేదని స్పష్టం చేశారు. ఈ దఫానే ఆ పార్టీకి చివరి ఎన్నికలన్నారు. ఒకప్పుడు ప్రధాని మోడీనే తిట్టి, మళ్లీ ఇప్పుడు బిజెపితో కలిసి వెళ్లాలని ఆరాటపడుతున్నారని విమర్శించారు. ఒకవైపు తానే ముఖ్యమంత్రిని అని పవన్.. మరోవైపు తమదే అధికారమని చంద్రబాబు, లోకేష్ అంటున్నారని, అసలు వీరు కలిసి పోటీ చేస్తారో? లేదో ప్రజలకైనా చెబుతారా? అని ప్రశ్నించారు. అనంతరం పంచాయతీ ఉప ఎన్నికల్లో పడాలపేట సర్పంచ్‌గా ఎన్నికైన సువ్వాడ శ్రీదేవి, కొండకరకాం వార్డు మెంబర్ తుమ్మగంటి మంగకు ఈ సందర్భంగా కోలగట్ల శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు నడిపేన శ్రీనివాసరావు, ఎఎంసి చైర్‌పర్సన్ శశిభార్గవి, తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా ఎన్నికైన సర్పంచ్, వార్డు మెంబర్‌ను అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

చిన్నారికి సాయం

కొండకరకాం గ్రామానికి చెందిన తుంపిల్లి గణేష్‌కు ఆరు నెలల కుమారుడు గుణవర్ధన్ ఉన్నాడు. చిన్నారికి మూడు నెలల వయస్సులో బ్రెయిన్ సంబంధిత వ్యాధి వల్ల సర్జరీ చేయాల్సి వచ్చింది. హైదరాబాద్‌లోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో వైద్యం అందించాలి. ఆరోగ్యశ్రీ పథకం వర్తించకపోవడం, ఆ కుటుంబానికి వైద్యం చేయించే స్తోమత లేకపోవడంతో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని కలిసి తమ పరిస్థితి విన్నవించుకున్నారు. వెంటనే స్పందించిన ఆయన సిఎం సహాయ నిధికి ప్రతిపాదించారు. అక్కడ నుంచి ఆమోదం లభించడమే కాక, రూ.1.20 లక్షలు మంజూరు చేశారు. దీంతో ఆ చెక్కును ఆదివారం తన నివాసం వద్ద చిన్నారి కుటుంబ సభ్యులకు కోలగట్ల అందజేశారు.

'చలో విజయవాడ' విజయవంతానికి ప్రచారం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఈ నెల 24న మున్సిపల్ కార్మికులు చేపట్టే చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఆదివారం నగరంలో ప్రచారం చేపట్టారు. స్టేడియంపేట, కొత్తపేట, బొంగవీధిలో ప్రచారం చేసి, చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, యూనియన్ రాష్ట్ర నాయకులు జగన్మోహనరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామన్న ముఖ్యమంత్రి తీవ్ర అన్యాయం చేశారన్నారు. 60 ఏళ్ళు దాటిన వారికి ఎలాంటి ఆర్థిక సహాయం చేయకుండా రిటైర్మెంట్ చేయడంతో చెత్త కాగితాలు ఏరుకుని బతకాల్సిన పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. హెల్త్ కార్డులు మంజూరు కాలేదన్నారు. పని భారం, వేధింపులు పెరిగాయని వాపోయారు. వీటన్నింటిపై చలో విజయవాడ కార్యక్రమానికి సిద్ధమవుతున్నట్లు తెలిపారు. అప్పటికీ ప్రభుత్వం మొద్దు నిద్ర వీడకుంటే సమ్మె చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కుమారి, రమ, ఈశ్వరమ్మ, పైడిరాజు, కృష్ణ, వంశీ పాల్గొన్నారు.

ప్రకృతికి భంగం కలిగించడం వల్లే పులుల భయం

- అనుకూలమైన స్థావరం దొరికే వరకు సంచరిస్తూనే ఉంటుంది
- స్థిరమైన స్థావరానికి 15 నుంచి 20 కిలోమీటర్ల గిరిశిఖరం అవసరం
- సురక్షితంగా బంధించేందుకు ప్రయత్నిస్తున్నాం
- ఈలోపు ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందే
- ప్రజాశక్తితో డిఎఫ్ఒ జిఎపి ప్రసూన ముఖాముఖి

ప్రకృతికి భంగం కలగడం వల్లే పులులు, ఏనుగుల నుంచి ప్రమాదాన్ని చవిచూడాల్సి వస్తోందని మన్యం జిల్లా అటవీశాఖ అధికారి, విజయనగరం జిల్లా ఇన్‌ఛార్జి డిఎఫ్ఒ జిఎపి ప్రసూన తెలిపారు. సహజ సిద్ధమైన అడవుల్లో మానవాళి కదలికలు ఎక్కువైనప్పుడు, అక్కడ నివశిస్తున్న జంతువులు ఇతర ప్రాంతాల్లోకి దిశమార్చుకుంటాయని వివరించారు. ప్రస్తుతం పులి పాలకొండ, భామిని ఏజెన్సీలోనూ, ఏనుగులు కొమరాడ ప్రాంతంలోనూ సంచరిస్తున్నాయని వెల్లడించారు. వాటి బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా పులి బొండపల్లి మండలం వెదురువాడ పంచాయతీ పనసలపాడు వద్ద ఉన్న దట్టమైన అటవీ ప్రాంతంలో మినహా ఎక్కడ స్థిరంగా ఉండడం లేదన్నారు. అనుకూలమైన స్థావరం దొరికే వరకూ పులి సంచరిస్తూనే ఉంటుందని వివరించారు. అప్పటి వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండడమే ఏకైక మార్గమన్నారు. విజయనగరం, మన్యం జిల్లాల్లో సంచరిస్తున్నది పెద్దపులిగానే పరిగణిస్తున్నామని స్పష్టంచేశారు. ఈ వారంలో తనను కలిసిన ప్రజాశక్తికి డిఎఫ్ఒ ప్రసూన ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

\- ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

? పులి ఎక్కడి నుంచి? ఎందుకు వచ్చినట్టు?.

పులి ఎక్కడి నుంచి వచ్చిందో స్పష్టంగా చెప్పలేం. ఎందుకంటే పాపికొండల్లో మినహా శ్రీకాకుళం, పార్వతీపురం, పాడేరు ఏజెన్సీల్లో పులులు ఉన్నట్టు మా రికార్డుల్లో కూడా లేదు. పులి స్థావరం ఉన్న ప్రాంతంలోకి జనాలు ప్రవేశించినప్పుడు లేదా పెద్దపెద్ద శబ్దాలు, మంటలు వంటివి ఏర్పడినప్పుడు పులులు వాటి స్థావరాన్ని మార్చుకుంటాయి. అటువంటి సందర్భాల్లో అనుకూలమైన స్థావరం దొరికే వరకూ సంచరిస్తూనే ఉంటాయి. పాపికొండలు లేదా ఒడిశా, చత్తీస్‌గడ్ అటవీ ప్రాంతం నుంచి వచ్చి ఉండవచ్చు. సాధారణంగా మైనింగ్, రోడ్ల నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టినప్పుడు అవి తమ దిశ మార్చుకుంటాయి.

? ప్రస్తుతం పులి ఎక్కడ ఉంది?.

ప్రస్తుతం మన్యం జిల్లా పాలకొండ, భామిని ఏజెన్సీలో సంచరిస్తున్నట్టుగా ఆనవాళ్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో భామిని మండలంలోని 52 గ్రామాల ప్రజానీకాన్ని అప్రమత్తం చేశాం. సాయంత్రం, తెల్లవారుజామున ఇళ్ల నుంచి బయటకు వెళ్లవద్దని ప్రచారం చేపట్టాం.

? మన ప్రాంతంలో సంచరిస్తున్నది చిరుతా? పెద్ద పులా?.

మన ప్రాంతంలో సంచరిస్తున్నది పెద్ద పులి. చిరుత కానే కాదు. పులిసైజును బట్టి ఆడ, మగ అనేది గుర్తిస్తాం. రంగులను బట్టి పెద్దపులా? చిరుత అనేది గుర్తించవచ్చు. పెద్ద పులి చర్మంపై చారులు కనిపిస్తాయి. అదే చిరుత అయితే చుక్కలు ఉంటాయి. చారులు కనిపిస్తున్నాయి కాబట్టి పెద్ద పులిగా భావించవచ్చు. దీన్ని సిసి కెమెరాల ఆధారంగా గుర్తించాం.

? పులి అనుకూల స్థావరాలు ఎలా ఉంటాయి?.

సాధారణంగా పులులు గిరిశిఖర గ్రామాల్లో స్థావరాన్ని ఏర్పాటు చేసుకుంటాయి. కనీసం 15 నుంచి 20 కిలోమీటర్ల విస్తీర్ణంలో సంచరిస్తుంది. ఆయా పరిసర ప్రాంతంలో మరో పులి ఉండేందుకు కూడా అవకాశం లేదు. ఎందుకంటే పిల్లలతో ఉన్న పులులు మినహా ఆడైనా, మగైనా అన్నీ ఒంటరిగానే ఉంటాయి.

? పులి ఎన్నిచోట్ల దాడికి పాల్పడింది?.

పులి సంచరిస్తున్న ప్రతి ప్రాంతంలోనూ దాడికి ప్రయత్నించింది. గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఇప్పటి వరకు పార్వతీపురం మన్యం జిల్లాలో నాలుగు చోట్ల, విజయనగరం జిల్లాలో నాలుగు చోట్ల పశువులు, మేకలు, గొర్రెలపై దాడికి పాల్పడింది.

? పులిని బంధించి, వాటికి అనుకూలమైన ప్రదేశానికి తరలించే ఏర్పాట్లు చేస్తున్నారా?.

వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం పులిని సురక్షితంగా బంధించి, స్థావరానికి అనుకూలంగా ఉండే అటవీ ప్రాంతానికి తరలించే ఆలోచనలోనే ఉన్నాం. అందుకనుగుణంగా ఆపరేషన్ చేపట్టాం. ఇంకా కొనసాగుతోంది. ఇప్పటికే మెంటాడ, గంట్యాడ, బొండపల్లి, దత్తిరాజేరు, పాలకొండ సహా పులి సంచరించినట్టు ఆనవాళ్లున్న అన్ని ప్రాంతాల్లోనూ ఆపరేషన్ చేపడుతున్నాం. ముఖ్యంగా బొండపల్లి మండలం వెదురవాడ పంచాయతీ పనసలపాడు వద్ద గల దట్టమైన అటవీ ప్రాంతంలో వద్ద ఎక్కువ రోజులు ఉన్నట్టుగా గుర్తించి, అక్కడ ప్రత్యేక ట్రాక్ కేజ్ ఏర్పాటు చేసి బంధించేందుకు తీవ్రంగా ప్రయత్నించాం. కానీ, అది తెలివిగా తప్పించుకుంటోంది. మా వంతు ప్రయత్నం చేస్తున్నాం.

అన్న కేంటీన్ వద్ద క్యూలో నిలబడిన పేదలు

పేదల కడుపు నింపుతున్న అన్న కేంటీన్

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణంలోని కీర్తిశేషులు మాజీ మంత్రి కోళ్ల అప్పలనాయుడు జ్ఞాపకార్థం నియోజకవర్గ టిడిపి ఇంచార్జి కోళ్ల లలిత కుమారి, రాంప్రసాద్ దంపతుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌టిఆర్ అన్న క్యాంటీన్ పేదల కడుపు నింపుతుంది. ఆదివారం నాటికి 18 రోజులు పూర్తిచేసుకుంది. పట్టణంలో ఈ అన్నా క్యాంటీన్ ఏర్పాటు చేయడం వల్ల పేదలకు ఆకలి తీరుతుందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హర్షం వ్యక్తం చేస్తున్న పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

జంగిల్ తొలగింపు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని బికె నాయుడుపేట వద్ద గల బిఆర్ అంబేద్కర్ బాలికల వసతి గృహం ఆవరణలో ఉన్న జంగిల్స్ తొలగింపు పూర్తయింది. ప్రభుత్వ అధికారులు చేయాల్సిన జంగిల్స్ తొలగింపు పనులను మానవతా దృక్పథంతో ఎస్ కోట నియోజకవర్గం టిడిపి యువ నాయకుడు, రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ, టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావుల ఆర్థిక సహాయంతో ఆరు రోజులు పాటు జెసిపితో జంగిల్స్‌తో పాటు ఆట స్థలాన్ని, క్వార్టర్స్ ఆవరణ, డార్మెంటు ఆవరణ, మొత్తం ఐదెకరాలను సదును చేయించారు. ఈ మేరకు వసతిగృహం ప్రిన్సిపల్ టిఎం ఫ్లోరిన్స్, ఉపాధ్యాయులు, విద్యార్థినిలు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన తల్లిదండ్రులు టిడిపి నాయకులకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న కోఆర్డినేటర్లు

ప్రకృతి వ్యవసాయం పరిశీలన

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని బొద్దాం సిఎస్ఎ ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రకృతి వ్యవసాయాన్ని కోఆర్డినేటర్లు ఆర్‌టిఎల్ ప్రకాష్, వెంకట్రావు ఆదివారం పరిశీలించారు. ఇక్కడ ఏ గ్రేడ్ మోడల్ ఎస్టిఎస్ బ్లాకులను పరిశీలించి వరిలో పురుగు తెగుళ్లపై రైతులకు సూచనలు చేశారు. వరిలో ఇప్పుడున్న వాతావరణంలో వర్షాలు లేకపోవడం వల్ల ప్రతి రైతు పొలంలో ద్రవ జీవామృతం పిచికారి చేసుకోవాలన్నారు

గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

గ్రంథాలయంలో 'చదవడం నాకిష్టం'

ప్రజాశక్తి- బాడంగి

స్థానిక శాఖా గ్రంథాలయంలో 'చదవడం నాకిష్టం' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి ఆర్. దుర్గా ప్రసాద్ తెలిపారు. ప్రతి రోజు పిల్లలతో కథలు చదివించడం, చెప్పించడం కంప్యూటర్ బేసిక్స్ నేర్పించడం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో 32మంది పిల్లలు పాల్గొని వినియోగించుకున్నట్లు ఆయన తెలిపారు. గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేవారి కోసం అన్ని రకాల పుస్తకాలుతో పాటు వార, మాస పత్రికలు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. అందరూ గ్రంథాలయానికి వచ్చి వినియోగించుకోవాలని కోరారు.

మారికకు రోడ్డు నిర్మించరా..?

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కరకవలస పంచాయతీ పరిధిలో గల మారిక గిరిజన గ్రామం ఎనిమిది కిలోమీటర్ల దూరంలో మారిక కొండల మధ్య ఉంది. ఈ గ్రామానికి కేంద్ర ప్రభుత్వం సడక్ యోజన పథకం కింద రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. నిధులు మంజూరై సుమారు ఎనిమిది సంవత్సరాలు కావస్తున్నా నిర్మాణ పనులు మాత్రం ముందుకు కదలడం లేదు. గిరిజనులు పలుమార్లు తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం పూర్తి చేయాలని ప్రజా ప్రతినిధులకు, అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకునే పరిస్థితి లేదు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిరసనలు, వంటావార్పు కార్యక్రమాలు చేపట్టినప్పుడల్లా ఉత్తుత్తి హామీలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారే తప్ప రోడ్డు నిర్మాణ పనులను మాత్రం పూర్తి చేయడం లేదు. దీంతోనే గిరిజనులంటే ప్రభుత్వాలకు ఎంత చులకన భావనో ఇట్టే అర్థమవుతోంది. అత్యవసర సమయాల్లో వైద్య సేవలకు కొండ దిగి వచ్చేలోపే ప్రాణాలు గాలిలో కలిసిపోవడమే తప్ప వైద్య సేవలు సకాలంలో అందడం లేదు. ఈ గ్రామంలో నివాసముంటున్న 250 కుటుంబాల్లో ఎవరికి ఏ ఆపద వచ్చినా నడుచుకుంటూ కిందకు రావాల్సిందే తప్ప వాహనాలు వెళ్లే మార్గం లేక అవస్థలు పడుతున్నారు. రోడ్డు నిర్మాణం పూర్తవకపోవడంతో ఆ గ్రామం వెళ్లాల్సిన వేపాడ పిహెచ్‌సి సిబ్బంది కొండ వరకు వచ్చి అక్కడే ఆగిపోతున్నారు. కొండపైకి వెళ్లిన తరువాత వర్షం వస్తే తమ పరిస్థితి ఏంటని అక్కడే నిలబడి ఆలోచిస్తున్న దృశ్యాన్ని ఈ ఫోటలో చూడొచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పూర్తిచేయాలని కోరుతున్నారు.

అమలు కాని హామీలతో అవస్థలు

మారిక గ్రామానికి వైద్య సేవలు నిమిత్తం వెళుతున్న వైద్య సిబ్బంది

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలోని పెద్ద తాడివాడ జంక్షన్ వద్ద రాజీవ్ గాంధీ 79వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. డిసిసి అధ్యక్షుడు సరగడ రమేష్ కుమార్ రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తెలుగు సూరిబాబు, రవి చిలక రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

డెంకాడ: రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బొబ్బిలి: మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆదివారం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు కాంగ్రెస్ నేతలు మువ్వల శ్రీనివాసరావు, ఎం.వెంకటరమణ, కార్యకర్తలు రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. ముందుగా కాంగ్రెస్ కార్యాలయంలో రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదల సంక్షేమానికి రాజీవ్ గాంధీ పని చేశారని వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శృంగవరపుకోట: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గడి బంగారు నాయుడు ఆధ్వర్యంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 79వ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గడి బంగారు నాయుడు, హనుమల్ శెట్టి నానాజీ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం జరగాలంటే ఒక్క కాంగ్రెస్ పార్టీవల్లనే సాధ్యమన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ తప్పక విజయం సాధిస్తుందని బడుగు బలహీన వర్గాలకు అండగ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌టి సెల్ చైర్మన్ చీమల అచ్చిబాబు, జిల్లా బీసీ సెక్రటరీ రాపేటి గోవర్ధన్ కుమార్, యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి: ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు పంపిణీ చేస్తున్న నాయకులు

పదవి ఆమెది..పెత్తనం ఆయనది

ప్రజాశక్తి- బొబ్బిలి

గ్రామ, మండల, మున్సిపాలిటీలలో ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన మహిళలకి బదులుగా వారి భర్తలు పెత్తనం చెలాయించడం చూస్తుంటే అధికార వైసిపి మహిళలకి ఎంతటి సముచిత స్థానం ఇస్తుతుందో అర్థమవుతుందని లోక్ సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర రావు అన్నారు. బొబ్బిలిలో ఆయన ఆదివారం విలేకర్లతో మాట్లాడుతూ కొద్దిరోజుల క్రితం బొబ్బిలి మున్సిపాలిటీలో ఒక మహిళా వార్డు కౌన్సిలర్ భర్త వేధింపులను భరించలేక ఒక మహిళ వాలంటీర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన కలకలం రేపిందన్నారు. ఇది జరిగిన కొద్ది రోజులకే అదే మహిళా వార్డు కౌన్సిలర్ భర్త మున్సిపల్ కార్యాలయంలో ఒక ఉద్యోగితో గొడవ పడి చేయి చేసుకునే వరకు వచ్చిందంటే వీరి పెత్తనం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. సర్పంచ్ ప్రతినిధి, ఎంపిపి ప్రతినిధి, కౌన్సిలర్ ప్రతినిధి అని పేర్లు పెట్టుకొని మహిళా ప్రజా ప్రతినిధుల భర్తలు పెత్తనం చలాయించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇదేనా వైసిపి ప్రభుత్వం మహిళలకు ఇచ్చే గౌరవం అని ప్రశ్నించారు. ఎమ్మెల్యే దృష్టికి ఈ విషయం వచ్చినా ఈ సమస్యని పరిష్కరించకుండా తాత్సారం చెయ్యడం సరికాదన్నారు. తక్షణమే సదరు వ్యక్తిపై చర్యలు తీసుకొని రాజ్యాంగ విలువలు కాపాడాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జాతీయ వినియోగదారుల హక్కుల పరిరక్షణ సంఘం ఉత్తరాంధ్ర కన్వీనర్ దాసరి సురేష్ పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - వంగర

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం ఎంపిపి ఉత్తర వెల్లి సురేష్ ముఖర్జీ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ వావిలిపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ముఖ్యంగా గత సమస్యల పరిష్కారాలపై వివరాలతో రావాలని కోరారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలన్నారు. ముఖ్యంగా ప్రజాప్రతినిధులు మాత్రమే హాజరు కావాలని చెప్పారు.

దెందేరులో గడపగడపకు ...

ప్రజాశక్తి - కొత్తవలస

ప్రతి కుటుంబం సంతోషంగా ఉండటమే వైసిపి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని దెందేరు గ్రామంలో ఆదివారం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం ద్వారా వర్తించిన పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ ఇంకా ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు. మరోసారి తనను, సిఎం జగన్మోహన్‌రెడ్డిని ఆశీర్వాదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, పిఎసిఎస్ చైర్మన్ గొరపల్లి శివ, మండల పార్టీ అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, జెసిఎస్ ఇంచార్జిలు బొంతుల వెంకటరావు, మేలాస్త్రి అప్పారావు, పల్ల భీష్మ, పిఎస్ఎన్ పాత్రుడు, స్థానిక సర్పంచ్ విరోతి వెంకటరమణ, ఎంపిటిసి వెలగల రమణ, సంతపాలెం బి.ఎ నాయుడు, సచివాలయం కన్వీనర్ గొర్లె శ్రీను, ఈశ్వరరావు, గులివిందాడ గణేష్, ఉత్తరాపల్లి గణేష్, ఆతవ రమేష్, జామి సాల్మన్ రాజు, లెంక నర్సింగరావు మండల సోషల్ మీడియా కన్వీనర్ కర్రి దేవుడు బాబు, మండలంలో ఉన్న సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

గోడౌన్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - గుర్ల

మండలంలోని గూడెం సొసైటీ గోడౌన్ నిర్మాణానికి ఆదివారం సొసైటీ చైర్మెన్ రెడ్డి మురళీధరరావు, జెడ్‌పిటిసి శీర అప్పలనాయుడు, వైసిపి మండల నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, డీఎల్‌డిఎ చైర్మెన్ బంగారు నాయుడులు శంకుస్థాపన చేశారు. గోడౌన్ నిర్మాణం నిమిత్తం రూ.35లక్షలు మంజూరు కావడంతో గుత్తేదారు నిర్మాణం పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఇటీవల కాలంలో పిఎసిఎస్ పక్క భవనం సుమారు రూ.60లక్షలతో ఏర్పాటు చేశామన్నారు. అనతి కాలంలోనే పక్కా గోడౌన్ మంజూరు కావడంతో దిన దినాభివృద్ధి చెందుతుందని చెప్పారు. రాష్ట్రంలో ప్రాథమిక సహకార పరపతి సంఘాలు బలోపేతానికి ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కృత నిశ్చయంతో ఉన్నారని చెప్పారు. మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా పరిషత్ చైర్మెన్ మజ్జి శ్రీనివాసరావు చొరవతో గూడెం సొసైటీ అభివృద్ధికి కృషి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి తోట తిరుపతి రావు, సొసైటీ డైరెక్టర్లు సూరి నాయుడు, సూర్యావు, నాని, గుజ్జంగివలస గ్రామ పెద్దలు రెడ్డి అప్పల నరసయ్య, వెంపడాపు సూర్యనారాయణ, అట్టాడ అప్పలరాజు అదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న వైసిపి నాయకులు

మహాసభలను విజయవంతం చేయండి

ప్రజాశక్తి- బొబ్బిలి

ఈ నెల 21,22 తేదీల్లో విజయవాడలో నిర్వహించనున్న 21వ రాష్ట్ర మహా సభలు విజయవంతం చేయాలని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్, ఉపాధ్యాయ సంఘం నాయకులు జెసి రాజు అన్నారు. మహా సభలకు వెళ్తున్న ఎన్‌జిఒల వాహనాన్ని స్థానిక ఎన్‌జిఒ హోమ్ వద్ద ఆయన ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక, పింఛను దారుల సమస్యలను మహా సభల్లో చర్చించి వాటిని ప్రభుత్వం ఆమోదించేలా కృషి చేయాలన్నారు. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేసేలా మహాసభలో తీర్మానం చేయాలని కోరారు. బొబ్బిలి తాలూకా యూనిట్ నుండి వివిధ శాఖలకు చెందిన 80 మంది ఉద్యోగులు మహాసభలకు హాజరవుతున్నట్లు బొబ్బిలి యూనిట్ ప్రధాన కార్యదర్శి బి రామారావు, ఉపాధ్యక్షులు జి రామారావులు తెలిపారు. కార్యక్రమంలో చుక్క శ్రీను, శంకర రావు, గౌరీ శంకర రావు, కర్ణ, సత్య రాజు ఉద్యోగులు పాల్గొన్నారు.

మహాసభలకు వెళుతున్న బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న జెసి రాజు



ఉదయ పావని తల్లిదండ్రులను సత్కరిసున్న టిడిపి నాయకులు రవిశేఖర్, తదితరులు

ఉదయపావని తల్లిదండ్రులకు సన్మానం

నెల్లిమర్ల: ఇటీవల ప్రకటించిన గ్రూప్ -1 ఫలితాల్లో డిఎస్‌పిగా ఎంపికైన మండలంలోని అలుగోలు గ్రామానికి చెందిన కెల్ల ఉదయపావని తల్లిదండ్రులు నారాయణప్పలనాయుడు, భారతిలను ఆదివారం టిడిపి నాయకులు సువ్వాడ రవిశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రవిశేఖర్ మాట్లాడుతూ ఉదయపావని తొలి ప్రయత్నంలోనే డిఎస్‌పి సాధించడం తల్లిదండ్రులకు మండలానికి, జిల్లాకు గర్వకారణమన్నారు. ఉదయపావనిని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లిమర్ల మండల ఉపాధ్యక్షులు కురిమినేని దివాకర్, మత్స బోజిచక్రపాని మాస్టారు, అలుగోలు గ్రామ పార్టీ అధ్యక్షుడు ఆల్తి బాబురావు, కెల్ల రమేష్, కొంచాడ గొల్లబాబు, వంజరాపు రామారావు, కెల్ల తవిటినాయుడు, బొమ్మిడి రాము తదితరులు పాల్గొన్నారు.

కంపుకొడుతున్న ఎంపిడిఒ కార్యాలయం

ప్రజాశక్తి - వేపాడ

స్థానిక మండల పరిషత్తు కార్యాలయం ఆవరణ కంపుకొడుతుంది. కార్యాలయం వెనుక భాగంలో చెత్త పేరుకుపోవడం, పిచ్చి మొక్కలు పెరిగి దుర్వాసన వెదజల్లుతోంది. ప్రజలకు సేవలు అందించే కార్యాలయం పరిస్థితే ఇలా ఉంటే గ్రామాల్లో పారిశుధ్యం పరిస్థితి ఎలా ఉంటుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చును. కార్యాలయానికి జిల్లా అధికారులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు వచ్చినప్పుడు మాత్రం కార్యాలయానికి వచ్చే మార్గంలో రెండు వైపులా సున్నం జల్లి అందంగా తీర్చిదిద్దుతున్నారు. వెనుక ఉన్న చెత్తను మాత్రం శుభ్రం చేయడం లేదు. కాగా తాగునీటి సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన ట్యాంకులు కూడా లీకై తాగునీరు కూడా వృధాగా పోవడం గమనార్హం.



ఎంపిడిఒ కార్యాలయం వద్ద పెరిగిన పిచ్చిమొక్కలు

ఎట్టకేలకు వరి నాట్లు

ప్రజాశక్తి - వంగర

మండలంలోని శివ్వాం, ఎం సీతారాంపురం, వంగర, తలగాం గ్రామాలలో రైతులు ఎట్టికేలకు వరినాట్లు వేస్తున్నారు. కొద్దిపాటి వర్షం కురవడంతోపాటు కొంతమంది రైతులు వద్ద ఉన్న సాగునీటి బోర్లు ద్వారా నీటిని విడిచిపెట్టి పొలాల్లో దమ్ము చేపట్టి వరినాట్లు వేస్తున్నారు. తోటపల్లి కుడి ప్రధాన కాలువ ద్వారా కొంతమేర సాగునీరు వచ్చినప్పటికీ మండలంలోని బంగారు వలస, కొప్పరవలస, కొత్తవలస, మద్ది వలస తదితర గ్రామాలలో రైతులు వరినాట్లు వేశారు. శివారును ఉన్న గ్రామాలకు సాగునీరు సకాలంలో అందకపోవడంతో ఎన్నో ఇబ్బందులు పడి వరి నాట్లు ఆలస్యంగా వేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని సాగునీటిని శివారు భూములకు అందేవిధంగా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

పొలంలో నాట్లు వేస్తున్న మహిళలు

భూ కబ్జాపై సమగ్ర దర్యాప్తు నిర్వహించండి

ప్రజాశక్తి- బొబ్బిలి

మండల పరిధిలోగల మెట్టవలస గ్రామ హైవే రోడ్డుకు ఆనుకుని ఉన్న కొంత ప్రభుత్వ భూమిని ఒక రెవెన్యూ అధికారి అండదండలతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఆక్రమణలు చేసి అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని తక్షణమే రెవెన్యూ యంత్రాంగం స్పందించి ఏదైతే ఆక్రమణకు గురైన భూమిని సమగ్ర దర్యాప్తు నిర్వహించి స్వాధీనం చేసుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ డిమాండ్ చేశారు. ఆదివారం మెట్టవలస గ్రామ హైవే పక్కన ఉన్న ఆక్రమణకు గురైన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యం వల్ల లక్షలాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయన్నారు. ఇప్పటికే బొబ్బిలి నియోజకవర్గ పరిధిలో పలు ప్రభుత్వ చెరువులు, ప్రభుత్వ స్థలాలు కబ్జాలు కోరల్లో పడి పూర్తిగా కనుమరుగయ్యాయన్నారు. ప్రత్యేకంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు బరితెగించి కొంతమంది రెవెన్యూ అధికారుల అండదండలతో తప్పుడు రికార్డులు సృష్టించి ప్రభుత్వ భూములను జిరాయితీ భూములుగా తారుమారు చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న పాల్గొన్నారు.

పాడేరు ఘటన బాధాకరం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఘాట్ రోడ్డులో బస్సు అదుపు తప్పి లోయలో పడి ఇద్దరు మృతి చెందడం, సుమారు 20 మందికి గాయాలవడం బాధాకరమని ఆర్‌టిసి జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ అన్నారు. ఈమేరకు ఆమె మృతుల కుటుంబాలకు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. గాయపడిన క్షతగాత్రులను పరామర్శించడానికి సోమవారం ఆమె పాడేరు వెళ్ళనున్నట్లు తెలిపారు. ఈ దుర్ఘటన పై వెంటనే ఆర్‌టిసి అధికారులతో మాట్లాడి గాయపడిన వారి ఆరోగ్య పరిస్థితులను, ఆ దుర్ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని వారికి అవసరమైన అన్ని వైద్య సౌకర్యాలూ కల్పిస్తున్నామని చెప్పారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

- ప్రమాదమా? హత్యా? ఆత్మహత్యా?
- ఆంధ్ర జలాశయంలో లభ్యమైన మృతదేహం

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని లోతుగెడ్డ గ్రామానికి చెందిన ఎలిగాపు నాగరాజు(22) అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. ఆంధ్ర జలాశయంలో ఆదివారం నాగరాజు మృతదేహం లభ్యమైంది. కుటుంబ సభ్యులు, పోలీసులు వివరాలు ప్రకారం.. నాగరాజు జెసిబి ఆపరేటర్‌గా విశాఖలో పరిసర ప్రాంతాలలో పనిచేస్తున్నాడు. కొద్ది రోజులు క్రితం లోతుగెడ్డ స్వగ్రామం వచ్చాడు. శనివారం ఉదయం 6గంటల సమయంలో స్నేహితులతో కలిసి కాలకృత్యాలు తీర్చుకొనేందుకు ఆంధ్ర జలాశయం వైపునకు వెళ్లాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. జలాశయం గట్టుపై నాగరాజు బట్టలు, చెప్పులు వుండడం గమనించిన నాగరాజు తల్లి రామలక్ష్మి ఆంధ్ర పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కాగా ఆదివారం నాగరాజు మృతదేహం ఆంధ్ర జలాశయంలో లభ్యమైంది. నాగరాజు చిన్నతనంలోనే తండ్రి అప్పలస్వామి మృతి చెందాడు.

నాగరాజు ఒక్కడే సంతానం

నాగరాజు తండ్రి అప్పలస్వామి చిన్న తనంలోనే చనిపోయినా కొడుకులో భర్తను చూసుకుంటూ బతుకుతున్నాని తల్లి రామలక్ష్మి బోరున విలపిస్తుంది. ఒక్కగానొక్క కొడుకు అనుమానాస్పదంగా మృతి చెందడంతో ఆమె కన్నీటి పర్యంతమవుతోంది. అసలు నాగరాజు ఎలా చనిపోయాడన్న అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. స్నేహితులతో కలిసి జలాశయానికి చేపలు వేటకు వెళ్లారని స్థానికులు చెబుతున్నారు. అయితే నాగరాజు వాళ్ళతో చేపలు వేటకు వెళ్ళాడా లేదా అన్నది స్పష్టత లేదు. కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లిన నాగరాజు బట్టలు, చెప్పులు జలాశయం గట్టుపై ఎందుకు ఉన్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్నేహితులతో కలిసి చేపల వేటకు వెళ్లి ప్రమాదానికి గురయ్యాడా? స్నేహితుల మధ్య గొడవేమైనా జరిగిందా? ఈతకు దిగి మృతి చెందాడా? లేదా ఆత్మహత్యకు పాల్పడ్డాడా అని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు..

మృతి చెందిన నాగరాజు

IN THE HONORABLE COURT OF THE 4Th ADDITIONAL DISTRICT JUDGE CUM SC&ST COURT AT SRIKAKULAM
MVOP 70/2023

Between:
Gondu yerramnaidu @Yarranna Naidu --petitioner
And:
Korada Ramu and others --Respondents

To,
R-1 Kurada Ramu, S/o. Late Papayya, Hindu, aged about 45 years, Driver of the crime Vehicle bearing No.AP31 TH 0729, R/0. Tarravalasa village, Bogapuram Mandal, Vizianagaram District.

That the above named Petitioner has filed the above M.V.O.P. for claiming compensation under M.V. Act, against you and 2 others and the same is posted to **31-08- 2023** for your appearance before the Honourable Court. Therefore you are hereby directed to appear before the Honourable Court on **31-08-2023 at 10-30 A.M.,** either in person or through an Advocate, failing which the matter will be decided as per Law in your absence.

GONDU PRASADARAO
Advocate,
SRIKAKULAM.